
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్టం 31.2, కనిష్టం 20.4

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ జిల్లా వార్తలు

3

గురువారం 18 జనవరి 2024









మహేశ్‌కుమార్‌గౌడ్

విధేయతకు పెద్దపీట

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా మహేష్‌కుమార్‌గౌడ్
- ఖరారు చేసిన ఏఐసీసీ
- జిల్లాలో పార్టీ శ్రేణుల సంబురాలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 17: కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా, పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న జిల్లాకు చెందిన మహేష్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ అధిష్ఠానం విధేయతకు పెద్దపీట వేసినట్లయింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తూ ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18 గురువారం నామినేషన్ల గడువు ముగియనుండటంతో పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఖరారు చేసింది. చివరి వరకు ఉత్కంఠతతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన అధిష్ఠానం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ నాయకుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బలుమూరి వెంకట్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరగనున్న మొదటి ఎన్నిక కావడంతో ఎమ్మెల్సీ కోసం చాలా మంది సీనియర్ నాయకులు పోటీ పడినప్పటికీ పార్టీలో సీనియర్‌గా, పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్‌కు అవకాశం దక్కడంతో విధేయతకు పెద్దపీట వేసినట్లయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల కోసం మొదటి దఫాలోనే ఎమ్మెల్సీగా మహేష్‌కుమార్‌గౌడ్ అవకాశం ఇవ్వడంతో జిల్లాకు ప్రాధాన్యం దక్కినట్లు అయింది. పార్టీలో విద్యార్థి సంఘ నాయకుడిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

కార్యకర్త నుంచి అంచెలంచెలుగా..

భీంగల్ మండలం రహత్‌నగర్‌కు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న ఆయన గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న క్రమంలోనే 1986లో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 1994లో డిచ్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న వయస్సులోనే పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఎనిచేశారు. 2014లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019, 2023 ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్‌ను అధిష్ఠానం మైనార్టీలకు కేటాయించడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. కాంగ్రెస్‌లో విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదిగి వర్కింగ్ ప్రసిడెంట్‌గా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

అధిష్ఠానం హామీ..

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రియాశీలక పాత్రను పోషిస్తూ పార్టీలో అన్ని తానై వ్యవహరిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్‌కు అధిష్ఠానం గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చింది. నిజామాబాద్ అర్బన్ టికెట్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేయగా మాజీ మంత్రి షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్ నుంచి అభ్యర్థిగా నిలపడంతో మహేష్‌కుమార్‌గౌడ్ తన టిక్కెట్‌ను త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ విషయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితర ముఖ్య నేతలు భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడంతో ఈనెల 29న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీలను గెలుచుకునే అవకాశం ఉంది. దీంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు అధిష్ఠానం మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్సీగా ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డితో మహేష్‌కుమార్‌గౌడ్ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎంగా ఎన్నిక కావడంతో పార్టీ వ్యవహారాలన్నీ ప్రస్తుతం మహేష్‌కుమార్‌గౌడ్ చూస్తున్నారు.

ఎన్నిక లాంఛనమే..

ఈనెల 29న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి. టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడిగా గత ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం క్రియాశీలకంగా పనిచేసి నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని మైనార్టీ కోసం త్యాగం చేసిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు గతంలో అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. ఎమ్మెల్యేల ద్వారా వేర్వేరుగా రెండు ఎమ్మెల్సీలకు ఎన్నిక జరగనుండటంతో రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. దీంతో మహేష్‌కుమార్‌గౌడ్ ఎన్నిక లాంఛనమే కానుంది. శాసన మండలి సభ్యులుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌషిక్‌రెడ్డిలు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడంతో శాసన మండలికి రాజీనామా చేశారు. దీంతో వీరి స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. మరో నాలుగు ఏళ్ల పాటు ఎన్నికైన వారు ఎమ్మెల్సీలుగా ఉండే అవకాశం ఉంది.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు..

టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించడంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహేష్‌కుమార్‌గౌడ్ అనుచరులు బుధవారం కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, తదితర నేతల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈసా, దయాకర్‌గౌడ్, మాజీద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఈ నెలాఖరు లోపు 'రైతు బంధు'

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నందిపేట, జనవరి 17: ఈ నెలాఖరు లోపు రైతులందరి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం నందిపేట మండలం ఆంధ్రనగర్‌లో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు రైతు డిక్లరేషన్‌లు అమలు చేసి తీరుతామన్నారు. రైతుల రుణమాఫీ అమలుకై సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో కృషి చేస్తున్నారని అన్నారు. తాము ఎక్కడ ఉన్నా ఏ పదవిలో ఉన్నా రాష్ట్ర రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశీస్సులతో రాజకీయాలకు వచ్చి తాము ఆయన ఆశయాలకు అనుగుణంగా నిజాయితీగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. అనాడు ఎన్‌టీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నేడు దేశం అంతటా అన్ని పార్టీలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. రైతుల అవసరాలు కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల విషయంలో ఏ మాత్రం రాజీ పడబోమని ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్‌లో పొందుపరిచిన ప్రతీ హామీని నెరవేరుస్తామని మంత్రి తుమ్మల అన్నారు. రైతులు గర్వంగా తలెత్తుకొని నిలబడాలన్నదే తమ సంకల్పమన్నారు. రైతులకు రుణమాఫీ అమలు చేసే విషయంలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో పని చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్, బోధన్ ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్, అరికెల నర్సారెడ్డి, దేగాం యాదాగౌడ్, గడుగు గంగాధర్, సర్పంచ్ నాయుడు రామారావు, ఎంపీటీసీ గింజుపల్లి రాధ, నాయకులు దేగాం గంగారెడ్డి, పెంట ఇంద్రుడు, దన్‌శీను, మహిపాల్, పిప్పెర సాయారెడ్డి, హన్మంతురావు, ఎన్‌టీఆర్ నిర్మాణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రనగర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడు..

డిచ్‌పల్లి: నందమూరి తారకరామారావు స్ఫూర్తితో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి తప్పక కృషి చేస్తుందని, ఎన్టీఆర్ నేటికీ ఆదర్శప్రాయుడని అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుతో కలిసి ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని 2లక్షల రుణమాఫీని దశల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఈ నెలకారు లోగ రైతు భరోసా నిధులు రైతుల ఖాతల్లో జమ అవుతాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లాకు తొలిసారిగా వచ్చిన మంత్రి తుమ్మలకు అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వాజీద్ హుస్సెన్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం తెలిపారు.

గుట్టుగా గంజాయి దందా..





- జిల్లాలో జోరుగా గంజాయి సరఫరా
- ఒరిస్సా టూ నాందేడ్, నాందేడ్ టూ నిజామాబాద్ వరకు అక్రమ రవాణా
- రవాణాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా
- రైళ్లల్లో ఎక్సైజ్ అధికారుల ముమ్మర తనిఖీలు

సుభాష్‌నగర్, జనవరి 17: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వినియోగం ఆగడంలేదు. పోలీసులు నజర్‌పెట్టి కేసులు నమోదు చేస్తున్నా వివిధ మార్గాల్లో సరఫరా చేస్తున్నారు. అవసరమైన వారికి ప్రత్యేకమైన మార్గాల్లో మత్తు పదార్థాలను చేరవేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గంజాయి యువతను పెడదోవన పట్టిస్తోంది. జిల్లాలో ప్రతి గ్రామ గ్రామాన గంజాయి అడ్డాలు వెలిశాయి. గ్రామంలో చాక్లెట్ దొరుకుతుందో లేదో కానీ గంజాయి చాక్లెట్ మాత్రం ఈజీగా దొరుకుతోంది. గంజాయి అక్రమ రవాణాకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టినా ఫలితం ఉండడం లేదు. గంజాయి అక్రమ రవాణాదారులు అధికారుల ఎత్తు గడలను చిత్తుచేస్తూ దర్జాగా తమ దందాను కొనసాగిస్తున్నారు. పలుమార్లు పట్టుబడినా ఈజీ మనికి అలవాటు పడిన గంజాయి అక్రమ రవాణాదారులు దందాను చేస్తున్నారు. వివిధ రూపాల్లో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. చాక్లెట్ల రూపంలో, పొగాకు రూపంలో ఎండు గంజాయి, పచ్చి గంజాయి, తాజాగా గంజాయి నూనె రూపంలో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక రూపంలో అరికడదా మంటే ఎక్సైజ్ అధికారులకు వ్యాపారులు వివిధ రూపాల్లో గంజాయిని అమ్ముతూ వారికి ఛాలెంజ్ విసురుతున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో గంజాయిని నూనె రూపంలో అమ్మకాలు జరగడం సంచలనం రేపింది. ఈ గంజాయి రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోకి రాకుండా అరికట్టాలనే ఉద్దేశంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసారు. చెక్ పోస్టులలో సిబ్బందిని సైతం పెంచారు. ముఖ్యంగా రైళ్ల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించిన ఎక్సైజ్ అధికారులు రైళ్లల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెట్టారు.

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుంటాం..

: మల్లారెడ్డి, (ఎక్సైజ్ సూపరింటెండెంట్)

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. ఇప్పటికే గంజాయి రవాణా చేస్తున్నవారిని అరెస్టు చేయడం జరిగింది. ముఖ్యంగా రైలు ద్వారా గంజాయి అక్రమ రవాణా జరుగుతోంది. రైళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో గంజాయి రాకుండా చూస్తున్నాం. చెక్‌పోస్టులలో సిబ్బందిని సైతం పెంచాం. అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

ఒరిస్సా టూ నాందేడ్, నాందేడ్ టూ నిజామాబాద్

జిల్లాలో గంజాయిని ఒరిస్సా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఒరిస్సా నుంచి నేరుగా కాకుండా (ఏవోబీ) ఆంధ్ర ఒరిస్సా బార్డర్ నుంచి రైలు ద్వారా నాందేడ్‌కు తీసుకొచ్చి, నాందేడ్ నుంచి నిజామాబాద్‌కు చేరవేస్తున్నారు. నిజామాబాద్ నుంచి వివిధ మండలాలకు, గ్రామాలకు చేరవేస్తూ గంజాయిని అమ్ముతు వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రైళ్లనే వారి అక్రమ రవాణాకు కేంద్రంగా ఎంచుకొని తమ వ్యాపారాన్ని చేస్తున్నారు. ఒరిస్సా నుంచి నాందేడ్‌కు రైలు ద్వారా చేరుకున్న గంజాయిని నాందేడ్ నుంచి నిజామాబాద్‌కు రైలు ద్వారా చేరవేయడాన్ని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. రైళ్లలో టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల రైళ్లలో తనిఖీలు చేసి గంజాయిని రవాణా చేస్తున్న వారిని పట్టుకున్నారు. ధర్మాబాద్ వరకు వెళ్లి అక్కడి నుంచి నిజామాబాద్ వరకు రైలులో తనిఖీలు నిర్వహించి నిజామాబాద్‌కు గంజాయిని తరలించకుండా అడ్డుకుంటున్నారు.

బార్డర్ చెక్‌పోస్టుల్లో సిబ్బంది పెంపు

బార్డర్ చెక్‌పోస్టుల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు సిబ్బందిని పెంచారు. బార్డర్ చెక్ పోస్టులు సాలూర, యంచ తదితర చెక్‌పోస్టుల్లో గతంలో ఉన్న సిబ్బందికి మరో ఇద్దరిని అధనంగా పెంచారు. నిజామాబాద్ జిల్లాలో ఈ చెక్ పోస్టుల ద్వారానే గంజాయి అక్రమ రవాణా జరుగుతుంది. గంజాయి అక్రమ రవాణతోపాటు దేశీదారు, ఎన్‌డీపీయల్ మద్యంను కూడా ఈ చెక్‌పోస్టుల ద్వారా రవాణా జరుగుతుంది. వీటన్నింటిని అరికట్టేందుకు అదనపు సిబ్బందిని ఎక్సైజ్ అధికారులు ఏర్పాటు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరహరి

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

ఖిల్లా, జనవరి 17: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న సమాచారం మేరకు మూడో టౌన్ ఎస్సై సిబ్బందితో తనిఖీలు చేయగా అనుమానాస్పదంగా ఉన్న ఖలీల్‌వాడికి చెందిన సయ్యద్ సాజీద్‌అలీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు నగర సీఐ నరహరి తెలిపారు. వివరాలను ఆయన బుధవారం తన ఛాంబర్‌లో ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. సాజీద్ అలీ గత కొంత కాలంగా గంజాయి అమ్ముతున్నట్లు ఇతను మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అనీస్ అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి యువకులకు అమ్ముతున్నట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడ్డ సాజీద్‌ను అదుపులోకి తీసుకొని ఆయన వద్ద నుంచి 1250 గ్రాముల గంజాయిని, 10వేల నగదును, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాజీద్‌ను కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

లిఫ్టులో ఇరుక్కున్న సెక్యూరిటీ గార్డ్

- రెండు గంటల పాటు కష్టపడి.. బయటకు తీసిన సిబ్బంది

ఖిల్లా, జనవరి 17: నగరంలోని కోటగల్లిలో గల ఓ షాపింగ్ మాల్ లిఫ్ట్‌లో బుధవారం ఓ సెక్యూరిటీ గార్డు ఇరుక్కుని రెండు గంటల పాటు నరకయాతన అనుభవించాడు. కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ హౌజ్‌లోన్ బ్యాంకులో మహేందర్ గౌడ్ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా మహేందర్ గౌడ్ లిఫ్ట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కి దిగే క్రమంలో ఒక్కసారిగా అందులో ఇరుక్కుపోయాడు. దీంతో లిఫ్ట్ ఆగిపోయి కాలు బయట, శరీరం లోపల ఉండిపోయింది. భయపడ్డ మహేందర్ పెద్దగా కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి అతి కష్టమ్మీద సెక్యూరిటీ గార్డ్‌ను బయటకు తీశారు. దీంతో అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.





- లిఫ్టులో ఇరుక్కున్న మహేందర్ గౌడ్

ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యక్షుడిగా మధుసూధన్ జోషి



ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 : ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా వెక్టర్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మధుసూదన్‌జోషి ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం నగరంలో జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్ జోషి, ప్రధాన కార్యదర్శిగా హన్మంత్‌రావు, కోశాధికారిగా సంఘం సంతోష్, ఉపాధ్యక్షుడిగా మైసయ్య, సంయుక్త కార్యదర్శిగా అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్, బాలాజీరావ్, గౌరవ అధ్యక్షుడిగా సీ హెచ్ రజినీ కాంత్, ముఖ్య సలహాదారులుగా ముజీబ్ అలీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వరదారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, హరిప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు జూనియర్ కళాశాలల సమస్యలపై పనిచేస్తామని తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతీ ఒక్కరికి మధుసూదన్‌జోషి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల మండలస్థాయి అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, స్థానిక ప్రభుత్వ వైద్యులు ఎస్ఎల్ఎన్ స్వామి, ఎంపీవో సదాశివ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈవో కావ్య, ఉప సర్పంచ్ పాలెపు చిన్న గంగారాం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు

నిజామాబాద్ లీగల్, జనవరి 17: మద్యం తాగి ఆటోను నడిపిన రాజు అనే డ్రైవర్‌కు స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖాదీర్ 10 రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. గాంధీ చౌక్‌లో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా రాజు అనే ఆటోడ్రైవర్ మద్యం తాగి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటో నడుపుతున్నాడు. అతడిని పరీక్షించగా మద్యం తాగినట్టు నిర్ధారించిన పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో ఆటో డ్రైవర్ నేరాన్ని అంగీకరించడంతో 10రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్త్‌కు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించినన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్లు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్‌ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహాణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి


హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసకావొద్దు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎక్సైజ్ ఎస్సై మల్లేష్

మోపాల్, జనవరి 17: నేటి యువత మత్తు మాదక ద్రవ్యాలకు బానిసలై తమ అమూల్య జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ సూచించారు. బుధవారం మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో జైభారత్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఆయన చూపిన అడుగు జాడల్లో యువత నడుచుకోవాలని కోరారు. జైభారత్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు.ఇలాంటి ఆటపోటీలు మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు.గ్రామాల్లో ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు అమ్మినట్లయితే వెంటనే తనకు సమాచారం అందించాలని సూచించారు. గత 20 సంవత్సరాల నుంచి జైభారత్ యువజన సంఘం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిద్దార్థ, జైభారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, మాజీఎంపీటీసీ వెంకట్రామ్ నాయక్, యూత్ అధ్యక్షుడు, వీడీసీ అధ్యక్షుడు గోపూరు నరేష్‌రెడ్డి, దేవేందర్, గంగాప్రసాద్,మంచిప్ప సేవాలాల్, బాడ్సి, ముదక్‌పల్లి, అమ్రా బాద్, బైరాపూర్, తదితర గ్రామాల యువకులు పెద్ద సంఖ్యలో ఈ పోటీలో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 17: జిల్లాలోని 19 మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 3 నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కొరకు అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు టీఎంఆర్ఈఐఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వతరగతిలో మైనార్టీలకు ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసెస్, నాన్ మైనార్టీలకు లక్కీడ్రా ద్వారా 6,7,8 తరగతులలో, ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసెస్ ఇంటర్మీడియెట్‌లో ఎస్సెస్సీలో వచ్చిన జీపీఏ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ.లక్షా 50వేలకు మించొద్దన్నారు. పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ, కులధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని లేదా దగ్గరలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

శ్రీరాముని సేవలో ముస్లిం యువత

సిరికొండ జనవరి 17: ఈ నెల 22న అయోధ్యలో మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా సిరికొండలో జరిగే అన్నదాన కార్యక్రమానికి తాము సైతం అండగా ఉంటామంటూ ముస్లిం యువకులు ముందుకు వచ్చారు.22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన ప్రధానమంత్రి నరేంద్రమోదీచేతుల మీదుగా జరుగున్న నేపధ్యంలో ఆ రోజు గ్రామాభివృద్ధి కమిటీ, శ్రీలొంక రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానిన లైవ్ చూపించాలని గ్రామాభివృద్ధి కమిటీ నిర్ణయించింది.ఈ కార్యక్రమానికి ముస్లిం యువకులు రూ.5100లు ఆర్థిక సహాయాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు.కార్యక్రమంలో అధ్యక్షులు బాడాల సంతోష్, లింగం, శివారెడ్డి,ప్రవీణ్,గంగారాం, శ్రీధర్, సలావుద్దీన్, అసద్, జావీద్,మోసీన్,సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కేసుల వివరాలు వెల్లడి

సుభాష్‌నగర్, జనవరి 17: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి పర్యవేక్షణలో గత సంవత్సరం కాలంలో జిల్లాలోని ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పట్టుకున్న మత్తు పదార్థాల వివరాలను వెల్లడించారు. బుధవారం జిల్లా మద్యపాన నిషేధ ఆబ్కారీశాఖ కార్యాలయంలో అధికారులు వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాలపై నిరంతరం నిఘా, పర్యవేక్షణతో అడ్డుకట్ట వేస్తూ సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా నార్కొటిక్ డ్రగ్స్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్‌కు సంబంధించిన గత జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 53 కేసులు నమోదుచేసి 259.4 కేజీల ఎండుగంజాయి, 68గంజాయి ప్లాంట్లు, 3.6 కేజీల అల్ఫాజోలం, 2.3గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అయోధ్య రామమందిరం ప్రారంభం సందర్భంగా భజనలు

డిచ్‌పల్లి,జనవరి 17:అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా డిచ్‌పల్లి మండలంలోని నర్సింగపూర్ శివాలయంలో ఈనెల 16 నుంచి 22 వరకు భజన కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు శబరిమాత భజన మండలి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఆలయ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీ ఒక్కరు దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మైనర్‌లను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఆర్మూర్‌టౌన్ , జనవరి17: మైనర్ పిల్లలను తమ దుకాణాల్లో పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చైల్డ్ వెల్ఫేర్ అధికారి అనిల్ అన్నారు. బుధవారం పట్టణంలో పలు ప్రాంతాలలో ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు చదువు మానివేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. చిన్న పిల్లలను కచ్చితంగా పాఠశాలలకు వెళ్లాలని, పనిలో పెట్టవద్దని లేదంటే కఠినమైన చర్యలు తప్పవని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హన్మంతు, షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, గంగనర్సయ్య, వినయ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఆడేపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం అందిస్తా

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



టోర్నమెంట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి17: ఆర్మూర్ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి తనవంతు సహ కారం అందిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో 67వ స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదుసంవత్సరాలలో అన్ని పాఠశాలను తీర్చిదిద్దుతాననిఅన్నారు.ఆర్మూర్ ప్రాంతంలోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో, చదువుల్లో ఉన్నత స్థానానికి చేరుకునేలా చేయడానికి మొదటి ప్రాధాన్యతనిస్తానన్నారు. క్రీడాకారులు పీటీ ఉషాలాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న మేళకువలతో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి సత్తా చాటాలని అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులను అభినందించారు. తనవద్దకు ఏ సమస్య ఉన్న పేదలు ఎల్లవేళల రావొచ్చని వారి సంక్షేమం కోసమే తాను పటు పడుతానని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. ఈసందర్బంగా అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి,అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మర్కంటి గంగామోహన్, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిగౌడ్, ఉపాధ్యక్షుడు పెంట జలంధర్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, రాష్ట్ర పరిశీలకులు యూనిస్‌పాషా, నాగరాజు, మల్లేష్‌గౌడ్, మునిపల్లి సర్పంచ్ చిన్నసాయిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, వేల్పూర్‌కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న, వ్యాయమ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశ్నార్థకమే?

ఖిల్లా, జనవరి 17: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19 శుక్రవారం నిర్వహించడం ప్రశ్నార్థకంగా మారింది. గతంలో నిర్వహించిన సమావేశానికి సభ్యులు హాజరుకాలేదు. సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం హాజరుకాకపోవడంతో సమావేశం అంతంత మాత్రంగానే జరిగింది. జిల్లా పరిషత్ సమావేశాన్ని ఈనెల 19న జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన నిర్వహించడానికి నిర్ణయించినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గోవింద్ ప్రకటన వెలువడించారు. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు జరగడంతో కమిషనర్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ ఎంప్లాయిమెంట్ డైరెక్టర్ కొత్తగా ఆదేశాలను జారీ చేశారు. వారి ఆదేశాల ప్రకారం గ్రామ స్థాయిలో 2023-24తో పాటు 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశాలను నిర్వహించి 15వ ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్స్‌ల వార్షిక కేటాయింపుల నివేదికలను రూపొందించాలని ఆదేశాలు చేశారు. వీటిని జిల్లా పరిషత్ సమావేశం జరిగే ముందు రోజులోపు పీపుల్స్ ప్లాన్ కాంపేయిన్ సబ్‌కా యోజన అన్ని కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచనలు చేశారు. గ్రామీణ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి నోడల్ ఆఫీసర్‌గా అదేవిధంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో వనరుల కేటాయింపు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ, ఇతర శాఖల నిధులను రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు, జిల్లా పరిషత్ సభ్యులు వీటి నిర్వహణలో నిమగ్నమై ఉండటం వల్ల జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించడం ప్రశ్నార్థకంగా మారింది.

'న్యాయం చేయాలి'



సిరికొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పిట్ల రాములు

సిరికొండ జనవరి 17: తన గొంతు కోసిన వ్యక్తి పేరు చెప్పినా తమకు పోలీసులు న్యాయం చేయడం లేదని పిట్ల రాములు ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. సిరికొండ మండలం చిన్నవాల్గోట్ గ్రామంలో నివసించే పిట్ల రాములును డిసెంబరు 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి గొంతు కోసి పారిపోయిన సంఘటన పాఠకులకు విధితమే. చికిత్స పొంది కోలుకున్న రాములు, ఆయన భార్యలక్ష్మీ, కూతుళ్ల రేణుక, మౌనిక తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్సైకి మొర పెట్టుకోగా ఆయన విచారణ చేస్తున్నామని తప్పించుకుంటున్నారని రాములు చెప్పారు. బుధవారం సిరికొండలో రాములు, ఆయన కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన గొంతు కోసిన వ్యక్తి పేరు చెప్పినా పోలీసులు పట్టించుకోక పోగా.. తాము చెప్పిన వ్యక్తిపేరు చెప్పాలంటూ పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు న్యాయం చేయకుంటే తమ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే గతి లేదని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా పోలీసు అధికారుల వల్ల న్యాయం జరగదని భావించాల్సి వస్తోందని రాములు భార్య లక్ష్మీ అన్నారు.ఉన్నాతాధికారులు స్పందించి తమకు న్యాయంచేయాలని రాములు, ఆయన కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

విచారిస్తున్నాం : ఎస్ఐ రమేష్

చిన్నవాల్గోట్ సమీపంలో రాములుగొంతు కోసిన సంఘటనపై లోతుగా విచారణ చేస్తున్నాం.రాములు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి సిబ్బందితో వెళ్లి వారి కుటుంబ సభ్యుల నుంచి సమాచారాన్ని సేకరించాం. ఇంత వరకు రాములుకాని ఆయన భార్యలక్ష్మీ, కూతుళ్ల రేణుక,మౌనిక నిందితుడి పేరుచెప్పలేదు.గుర్తుతెలియని వ్యక్తిఅని మాత్రమేగొంతు కోశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.తాను గాని తన సిబ్బంది గాని ఏవ్యక్తి పేరు చెప్పాలని ఒత్తిడిచేయలేదు. కేసును పూర్తి స్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేస్తాం.

నడ్కుడలో బిల్లా బాగులు వర్ధంతి సభ

డొంకేశ్వర్, జనవరి17: డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో బీడీ కార్మి కుల సమస్యలపై పోరాటం చేసిన బిల్లా బాగులు మూడో వర్ధంతి సభను నిర్వహించారు. బుధవారం మండలంలోని నడ్కుడ గ్రామంలో బిల్లాబాగులు వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ హాజరై మాట్లాడుతూ బీడీకార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. పీఎఫ్ అమలు కోసం నిరంతరం ఉద్యమాలు, క్రీ యాశీలక పాత్ర పోషించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, ఏరియా కార్యకర్త సాయిరెడ్డి, కమిషన్‌దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయినాథ్, టేక్ దారులు, చంద్రశేఖర్, నాగరాజ్, భూమేష్, నారాయణ, సుద్ద చిన్నయ్య, మదర్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు.. బైక్‌ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖిల్లా, జనవరి 17: వివిధ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు బైకులను ఒకటోటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఏసీపీ విజయసారధి తెలిపారు. వివరాలను సీఐ ఛాంబర్‌లో సీఐ నరహరి ఒకటవ టౌన్ ఎస్సైతో కలిసి వివరాలను వెల్లడించారు. ఒకటోటౌన్ పరిధిలో అర్సపల్లి ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేయడానికి యత్నించిన మిర్చికంపౌండ్‌కు చెందిన పడమటి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రమేష్ డిసెంబరు 18న రాత్రి ఏటీఎంను ధ్వంసం చేసేందుకు యత్నించగా అల్లారం మోగడంతో పరారయ్యాడని సీసీ కెమెరాల ఆధారంగా అతన్ని ఈనెల 16న పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాలు దొంగిలిస్తున్న న్యాలకంటి శేఖర్, ఆకునూరి సతీష్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. వీరినిపట్టుకోవడంలో ఒకటోటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్, ఏఎస్సై షకీల్, సిబ్బంది గంగారాం, మధులను ఏసీపీ అభినందించారు.

'జీవన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి'

ఆర్మూర్‌టౌన్ జనవరి17: మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే పైడిరాకేష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబుకాదని, వ్యక్తిగత విమర్శలు మాని నియోజకవర్గ అభివృద్ధి కొరకు పాటుపడాలని, తక్షణమే ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి, అంకాపూర్ వీడీసీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ధర్పల్లిలో యువతి అదృశ్యం

ధర్పల్లి, జనవరి17: మండల కేంద్రానికి చెందిన కొదండం సంతోషి(18) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన సంతోషి బుధవారం ఉదయం 5గంటలకు గుడికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరి సాయంత్రానికి రాకపోవడంతో తల్లి సత్తెమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోటగిరి,జనవరి17: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సునీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్‌ల అప్పగింత

భీమ్‌గల్ రూరల్, జనవరి17: భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న ఐదు సెల్‌ఫోన్‌లను బుధవారం ఎస్సై హరిబాబు బాధితులకు అప్పగించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అట్టి ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భీమ్‌గల్‌లో ప్రతి సోమవారం సంతలో సెల్‌ఫోన్‌లు చోరీ అవుతున్నాయని, ఎక్కువగా బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎస్సై తెలిపారు.

టిప్పర్ల యజమానులకు జరిమానా

నవీపేట,జనవరి17: మండల కేంద్రంలో అక్రమంగా మొరం తవ్విన జేసీబీ, టిప్పర్ల యజమానులకు జరిమానవిధించడం జరిగిందని తహసీల్దార్ ధన్‌వాల్‌తెలిపారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టడంతో ఒక జేసీబీ, మొరం టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంపై జేసీబీకి రూ.20వేల, టిప్పర్‌కు రూ.10వేలచొప్పున జరిమాన విధించడం జరిగిందని తహసీల్దార్ వివరించారు. అక్రమంగా మొరంతవ్వకాలు చేపడితే తగినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ధర్పల్లిలో క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్పల్లి, జనవరి17: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జనరల్ సెక్రెటరీ అస్లం చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి ప్రవీన్ కుమార్, అధ్యాపకులు హరిత, ప్రసన్నజ్యోతి, విజయలక్ష్మి,అరుణ, మహేష్, మహిపాల్,గంగాప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ లెక్కింపు



శివాలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 17: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఒక లక్షా రూ.35 వేల 265 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి కమల, ఈవో రవీందర్ గుప్త, రాములు, ఆలయ కమిటీ ధర్మకర్తలు నారాయణ, ఎంఎల్ బాబు, నంద్యాల శ్యామ్, ఈరపుర పోశెట్టి, నర్సయ్య సేట్, లక్ష్మణ్ పటేల్‌లతో పాటు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ జ్యోతిబసు ఆశయ సాధనకు కృషి చేయాలి

బోధన్ రూరల్, జనవరి 17: కామ్రేడ్ జ్యోతిబసు ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన అడుగు జాడల్లో నడవాలని సీపీఎం పార్టీ బోధన్ కార్యదర్శి ఏశాల గంగాధర్ అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో జ్యోతిబసు 14వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో సీపీఎం పార్టీని అధికారంలో 34 సంవత్సరాలు నిలపడంలో ప్రధానపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు దండు సాయిలు, సాయికుమార్, పెద్ద సాయిలు, రాణి, నాగమణి, రమేష్, రాజు, నాగరాజు, సావిత్రి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్టలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్

రెంజల్,జనవరి17: మండలంలోని రెంజల్ నుంచి వీరన్నగుట్ట గ్రామం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను వీరన్నగుట్ట వద్ద పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

23 డ్రంకెన్‌డ్రైవ్ కేసులకు జరిమానాలు

ఖిల్లా, జనవరి 17: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేసిన వాటిలో 23 కేసులను బుధవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట హాజరుపర్చారు. వారిలో 22 కేసులకు గాను మొత్తం రూ.26వేల 500లను జరిమానా విధించగా, బనారస బాబు అనే వ్యక్తికి 10రోజుల జైలుశిక్ష విధించారు.

తాళం వేసిన మూడు ఇళ్లల్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, జనవరి17: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తిరుమల కాలనీ, మామిడిపల్లి వెంకటేశ్వరకాలనీలో తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు బొండ్ల ప్రవీన్, శ్రీకాంత్‌లు తెలిపిన వివరాల ప్రకారం పెర్కిట్‌లోని తిరుమలకాలనీలో నివాస ముంటున్న వారు తమ ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లడంతో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు గొల్ల ప్రవీన్ ఇంట్లో సుమారు 14తులాల బంగారంతో పాటు రూ.9వేల నగదు, శ్రీకాంత్ ఇంట్లో ఐదు తులాల వెండిని ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే మామిడిపల్లిలోని వెంకటేశ్వరకాలనీలో గుర్తుతెలియని దొంగలు ధర్పల్లి జోష్న ఇంటికి తాళం వేసి రాజారాంనగర్‌లోని తన అత్తగారింటిలో ఫంక్షన్‌కు వెళ్లడంతో గుర్తుతెలియని దొంగలు తాళలు పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రెండున్నర లక్షల నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సీసీ కెమెరాల డివైజ్‌ను సైతం ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి క్లూస్‌టీం సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధి తుల ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



బీరువాలోని వస్తువులను చిందరవందర పడి ఉన్న దృశ్యం



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.135	రూ.205	రూ. 225





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,050	రూ.59,050	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గుంటూరుకారం (9.20, 12.40, 4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : హనుమాన్ (9.00, 12.20, 3.40, 7.00, 10.20)
స్క్రీన్-3 : నా సామిరంగ (9.50)
: సలార్ (1.00)
: సైంధవ్ (4.35, 7.35, 10.35)
స్క్రీన్-4 : హనుమాన్ (9.50)
: నా సామిరంగ (1.05, 4.15, 7.25, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గుంటూరుకారం (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
స్క్రీన్-2 : నా సామిరంగ (10.20)
: సైంధవ్ (1.20, 7.45, 10.35)
స్క్రీన్-3 : హనుమాన్ (10.40, 4.30, 7.40)
: నా సామిరంగ (1.45, 10.40)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్